క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు

పాయకరావుపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయంలో వ్యవసాయశాఖ సలహా మండలి చైర్మన్ దేవవరపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సూరిబాబు మాట్లాడుతూ సకాలంలో ఈ క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ఏవో పి.ఆదినారాయణ, నీటి పారుదల శాఖ ఏఈ జి.శ్రీరామమూర్తి, సిబ్బంది శ్రావణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పెదగుమ్ములూరు విద్యార్థిని



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన హరిణితో పీఈటీ, హెచ్ఎం

ఎస్.రాయవరం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని హరిణి ఎంపికైనట్టు పీఈటీ నిర్మల శుక్రవారం తెలిపారు. గురువారం ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచి అండర్ 14 విభాగంలో ఎంపికైనట్టు చెప్పారు. హరిణికి ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ అభినందనలు తెలిపారు.

నేడు మండల సమావేశం

ఎస్.రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి



వాడ్రాపల్లి హైస్కూల్‌లో చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

మునగపాక: ప్రతి ఒక్కరూ తరచూ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం రత్నరాజు సూచించారు. వాడ్రాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో చేతుల శుభ్రంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. భోజనం ముందు తర్వాత చేతులను శుభ్ర పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధి సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయంలో సమావేశం

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8గంటలకు జరిగే సమావేశంలో అయ్యప్ప మాలధారణ, అన్నదానం ఏర్పాట్లపై చర్చిస్తారన్నారు.

రెగ్యులేటర్ గేట్ల మాయంపై ఫిర్యాదు

మునగపాక: మండలంలోని తోటాడ రెగ్యులేటర్ దరి గేట్లు కనిపించడం లేదంటూ మునగపాక పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. తోటాడ రెగ్యులేటర్ వద్ద గేట్లు మరమ్మతులకు గురికావడంతో ఇటీవల ఏషియన్ పెయింట్స్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే సాగునీరు ప్రవహించే సీజన్ కావడంతో ఖానాల వద్ద ఏర్పాటు చేసేందుకు అవసరమయ్యే గేట్లకోసం వాకబు చేయగా ఇంతవరకు అవి ఎక్కడ ఉన్నాయనే విషయమై నిర్ధారణ కాకుండా పోయిందని, అధికారులు తగు విచారణ చేపట్టాలని గ్రామానికి చెందిన రమేష్, ప్రసాద్‌లు ఫిర్యాదులో కోరారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే సీఎం జగన్ ధ్యేయం

ఎస్.రాయవరం: పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, దీనిలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. తిమ్మాపురం శివారు గోకులపాడులో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా వైద్య శిబిరంలో స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ పల్లెల్లో అందజేస్తున్న కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 385 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్టు పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ నాయకులు అద్దేపల్లి బొజ్జనన్న, నాగంబోయిన శ్రీనివాసరావు,అద్దేపల్లి నూకునాయుడు,పేరిచర్ల శ్రీపతిరాజు, అద్దేపల్లి బాబూరావు,మండల విద్యాశాఖాధికారి పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

మునగపాక: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా కలుగుతోందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. ప్రజలకు చేరువగా వైద్యం అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశంలోనే ఆదర్శవంతంగా నిలుస్తుందన్నారు. మండలంలోని ఉమ్మలాడ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు.ఈ సందర్భంగా పలు విభాగాలకు సంబంధించిన శిబిరాలను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలను వైద్యాధికారి ప్రవల్లికను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని చెప్పారు. 145 రకాల మందులు అందుబాటులో ఉంచడంతో పాటు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారని తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ,సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ(ఎస్ఆర్),ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి,ఉప సర్పంచ్ మందా రాము, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, మండల పార్టీ కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,యువజన విభాగం మండల అధ్యక్షుడు మొల్లేటి వినోద్,పార్టీ నేతలు సూరిశెట్టి శ్రీనివాసరావు,విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



గోకులపాడులో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



ఆవసోమవరంలో స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): సంపూర్ణ ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగుతోందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు తెలిపారు. అచ్యుతాపురం మండలం ఆవసోమవరం సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముందుగా స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరికీ పూర్తిస్థాయిలో వైద్య సేవలందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని తెలిపారు.డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు,కోఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్,కోన బుజ్జి,దేశంశెట్టి శంకర్‌రావు,పిన్నమరాజు వాసు తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మలాడలో వైద్య సేవల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు) అన్నారు. లాలంకోడూరులో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోకి వైద్య బృందాలు వచ్చి పరీక్షలు చేయడం, మందులు ఇవ్వడం గొప్ప విషయని చెప్పారు. నిపుణులైన వైద్యులు ఈ శిబిరాల్లో అందుబాటులో ఉండడం ప్రజలకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ(తేజ), జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, వైస్ ఎంపీపీ కొరెడ్డి నర్సింరరావు, సర్పంచ్ రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు డీఎస్ఎన్ రాజు(బుజ్జి) , ఎంపీడీవో కె.ఎస్.కొండలరావు, తహసీల్దార్ పి. భాగ్యవతి పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అరట్లకోటలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది



లాలంకోడూరులో వైద్యులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

పాయకరావుపేట: మండలంలోని అరట్లకోటలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో వైద్యులు విద్యాసాగర్, స్వరాజ్యం, కనకలక్ష్మి, కె.వెంకటకృష్ణ 435 మందికి వైద్య పరీక్షలు జరిపి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు తూము రాజుబాబు, తూము రమణ, గర్లంక వెంకటసూరి, వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శి నరేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

అధికారులు రాని సమావేశాలెందుకు?

నక్కపల్లి మండల సమావేశంలో సభ్యులు ధ్వజం

నక్కపల్లి: మండలసర్వసభ్య సమావేశాలకు కొన్ని శాఖల అధికారులు రావడం లేదని, ప్రతి సారీ ఇదే సమస్య తలెత్తుతోందని, అధికారులు రానప్పుడు సమావేశాలు నిర్వహించడం ఎందుకంటూ పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశంజరిగింది. ఈ సమావేశంలో వైస్ఎంపీపీ వీసం నానాజీ, సభ్యులు ఆకేటి గోవిందరావు తదితరులు మాట్లాడుతూ సమావేశాలకు చాలా మంది అధికారులు రావడం లేదన్నారు. గత సమావేశానికిరాని అధికారులపై ఏ చర్యలు తీసుకున్నారని నిలదీశారు. వారిపై చర్యలకు సిఫారసు చేయాలని తీర్మానించారు. అధికారులు అందుబాటులో ఉన్న రోజుల్లోనే సమావేశం ఏర్పాటు చేయాలని, ఆదివారం అయినా సరే సమావేశం నిర్వహించుకునే హక్కు మండల పరిషత్‌కు ఉందన్నారు. ఏపీఎఫ్‌యూఐడీసీ డైరెక్టర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో అధికారులు ప్రొటోకాల్‌పాటించడం లేదన్నారు. దళితమహిళ కావడం వల్లే ఎంపీపీకి సరైన గౌరవం ఇవ్వడం లేదని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎంపీపీని గాని, ప్రొటోకాల్ ఉన్న తనను గానీ ఆహ్వానించడం లేదని చెప్పారు. గొడిచర్ల పీహెచ్‌సీ అభివృద్ధికమిటీకి ఎంపీపీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారని ఎంపీపీకి తెలియకుండా అక్కడ సమావేశాలు, ఆస్పత్రిలో అభివృద్ధిపనులు చేపడుతున్నారని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీపీకి ఆహ్వానం ఉండటం లేదన్నారు. ఇకనుంచి అధికారులు పద్ధతి మార్చుకోకపోతే మండల సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకోవడంతోపాటు, సభా హక్కుల ఉల్లంఘనకింద చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం మంజూరుచేస్తున్న రేషన్‌కార్డుల జారీలో జాప్యం జరుగుతోందని, సిబ్బంది కొరత అని చెబుతున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. పౌరసరఫరాలశాఖ పనితీరు కూడా అధ్వానంగా ఉందని తెలిపారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. మండల పరిషత్‌లో ఎవరు పడితే వారు సమావేశాలు నిర్వహిస్తున్నారని, ఇటీవల మత్స్యకారుల సమావేశం నిర్వహించి ఎంపీపీని ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. ఎంపీపీకి సంబంధం లేనప్పుడు సమావేశ మందిరం ఎలా ఉపయోగిస్తారని నానాజీ నిలదీశారు. జల్‌జీవన్‌మిషన్ పనులు ఎంతవరకు వచ్చాయని ప్రశ్నించారు. చాలా గ్రామాల్లో పనులు జరగడం లేదన్నారు. ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. అధికారులంతా మండల సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జులు పాపారావు, మణిరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ అంబేడ్కర్,పరిపాలనాధికారి సీతారామరాజు, ఎంపీటీసీలు ఎల్.చంద్రరావు,రాజు, మధు, గోవిందు, తిరుపతిరావు,సర్పంచ్‌లు వెంకటేష్, బార్గవ్,రత్నకుమారి,రాజబాబు, సురేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ నానాజీ

ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు

నక్కపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైన ముగ్గురు మండల స్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. సివిల్ సప్లయిస్ డీటీ, ఆర్అండ్‌బీ ఏఈ, ఉద్యానవన శాఖాధికారులు శుక్రవారం జరిగిన మండల సమావేశానికి హాజరు కాలేదు. వీరు ఎటువంటి ముందస్తు అనుమతి తీసుకోలేదని ఎంపీడీవో తెలిపారు. శుక్రవారం జరిగిన మండల సమావేశంలో సభ్యులంతా గైర్హాజరైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసినందున ఆ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఎంపీడీవో తెలిపారు.

మట్టిని నమ్ముకుంటే సుఖ సంతోషాలు



కోలాటం ప్రదర్శన



కలశంలో మట్టి వేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి



నక్కపల్లి మండలంలో వివిధ గ్రామాల నుంచి సేకరించిన మట్టి, బియ్యాన్ని ఉంచిన కలశం

మునగపాక: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా చిన్న చిన్న కలశాల్లో సేకరించిన బియ్యం,మట్టిని పెద్ద పెద్ద కలశాల్లో వేసే కార్యక్రమాన్ని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేలతల్లి ఎంతో గొప్పదన్నారు. మట్టిని నమ్ముకున్న వారు సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారన్నారు. ఎంపీడీవో మన్మథరావు మాట్లాడుతూ మండలానికి ముగ్గురు చొప్పున మట్టి,బియ్యంతో ఢిల్లీకి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,వైస్ ఎంపీపీ బోజా వెంకటలక్ష్మి,ఎంపీటీసీలు ఇల్లా శిరీషా, కాండ్రేగుల కిరణ్‌కుమార్,వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు,ఉపాధిహామీ పథకం ఏపీవో ఎరకయ్య,వెలుగు ఏపీఎం కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా వివిధ గ్రామాల నుంచి సేకరించిన మట్టి, బియ్యాన్ని అమృతకలశంలో ఉంచి ఢిల్లీకి పంపిస్తున్నట్టు మండలపరిషత్ అధికారులు తెలిపారు. శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌ల సమక్షంలో మట్టి, బియ్యాన్ని ఉంచిన అమృత కలశాన్ని వారు పరిశీలించారు. మట్టిని, బియ్యాన్ని స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులతో ఈ కలశంలో వేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం,జెడ్పీటీసీ కాసులమ్మ, వైస్ఎంపీపీలు నానాజీ ఈశ్వరరావు, ఏపీఎఫ్‌యూఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జిలు మణిరాజు,పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

యలమంచిలి: ఏపీటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా బీశెట్టి లక్ష్మణరావు, అధ్యక్షుడిగా బొడ్డేడ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మల్లిపాటి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కర్రి కోదండ రామలక్ష్మి, నేతి సత్యనారాయణ, ఉప కార్యదర్శులుగా పిల్లా అప్పారావు, వి.సుజాత, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎ.చంద్రశేఖర్, వై.సత్యారావు, కె.వీరభద్రరావు, పి.వరలక్ష్మి, ఎం.పాపారావు, ట్రెజరర్‌గా జి.సర్వేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసరావు వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు.



ప్రమాణం చేస్తున్న ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం

కాపుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5లక్షలు



ఉమ్మలాడలోని కాపుల కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షల మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలోని కాపు కులస్తుల కమ్యూనిటీహాల్ నిర్మాణానికి మండల పరిషత్ ద్వారా మంజూరైన రూ.5లక్షలకు సంబంధించిన ఆర్డర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తి గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్టు చెప్పారు.

లేగదూడలకు సకాలంలో టీకాలు

మునగపాక: స్థానిక ముసిలితల్లి మూలసంఘ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన పశువ్యాధి నిర్ధారణ పరీక్షలకు రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. పశువులకు సంబంధించిన రక్తం,పేడ పరీక్షలు నిర్వహించి, రైతులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ లేగదూడలకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. లేగ దూడలకు బ్రూసిల్లా వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాంతీయ పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సౌజన్యంతో రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి హిమజ, ముసిలితల్లి మూలసంఘ రైతులు పాల్గొన్నారు.



రైతులకు మందులు అందజేస్తున్న మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మూలపేట గ్రామాభివృద్ధికి కృషి

మునగపాక: మూలపేట గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. గ్రామంలోని శ్మశానవాటికతో పాటు రహదారిపై పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, ఆడారి ఉదయ్, మొల్లేటి గోవిందరావు,కాండ్రేగుల శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ బొడ్డేడ ఆదికుమార్,రామాలయం కమిటీ చైర్మన్ ఆడారి కాశీరావు తదితరులు పాల్గొన్నారు.



మూలపేటలో తుప్పల తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

ఇసుక ట్రాక్టరు పట్టివేత

కోటవురట్ల: ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు దృష్టిసారించారు. అక్రమంగా రవాణాకు పాల్పడుతున్న వారిపై దాడులు చేస్తున్నారు. రామన్నపాలెం సమీపంలో ఎటువంటి అనుమతి లేకుండా ట్రాక్టరులో ఇసుకను తరలిస్తుండగా ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టరు

పైడమ్మ చెరువుపై తహసీల్దార్‌కు వినతి

రాంబిల్లి: తమ గ్రామాన్ని తరలించేవరకు తమ గ్రామ పరిధిలో ఉన్న పైడమ్మ చెరువును వినియోగించుకునేలా అనుమతి ఇవ్వాలని కోరుతూ వాడనర్సాపురం గ్రామస్థులు శుక్రవారం తహసీల్దార్ పి.భాగ్యవతికి వినతిపత్రం అందజేశారు. ఈ చెరువును ఎన్ఏవోబీకి రెవెన్యూ అధికారులు అప్పగించారు. దీంతో శుక్రవారం ఈ చెరువు స్థలంలో క్రికెట్ ఆడుతుండగా నేవీ అధికారులు అడ్డుకున్నారని సర్పంచ్ కారె రామారావు, మాజీ సర్పంచ్ ఎర్రయ్య తెలిపారు. తమ గ్రామాన్ని తరలించేవరకు, తమకు రావాల్సిన పరిహారం అందేవరకు తమ గ్రామస్థులు ఈ స్థలాన్ని వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



తహసీల్దార్ భాగ్యవతికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ రామారావు తదితరులు

తెగుళ్ల నివారణతో వరిలో అధిక దిగుబడులు

అనకాపల్లి రూరల్: వరిలో తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని తుమ్మపాల ప్రాంతంలో సాగులో ఉన్న వరి పొలాలను ఆయన పరిశీలించారు. సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. సాంబమసూరీ రకం వరి పంటకు ఎక్కువగా అగ్గి తెగులు వ్యాపిస్తోందన్నారు. దీని నివారణకు లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లజోల్ క్రిమి సంహారక మందును కలిపి, పిచికారీ చేయాలన్నారు. సుడి దోమ ఉధృతి నివారణకు 1.6 మి.టీ. మోనోక్రోటోఫోస్ లేదా 2 గ్రాముల ఎసిఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆకుముడత నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. రైతులకు సాగులో చీడపీడలు, తెగుళ్ల నివారణలో ఏ సందేహాలున్నా నివృత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. తమ సేవలను రైతులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఆత్మ ఏటీఎం రామకృష్ణ

పాదయాత్ర భవానీ భక్తులకు ఆతిథ్యం

కశింకోట: పాదయాత్రగా విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళుతున్న భవానీ భక్తులకు మండలంలోని చింతలపాలెంలో శుక్రవారం ఆతిథ్యమిచ్చారు. విజయనగరం జిల్లా లక్ష్మీపురం నుంచి విజయవాడకు పాదయాత్రగా బయలుదేరిన ఏడుగురు భవానీ భక్తల బృందం చింతలపాలెం చేరుకుంది. స్థానిక సర్పంచ్ కొట్టి రాము, గురుభవాని జెర్రిపోతుల నూకినాయుడు తదితరులు స్వాగతం పలికి, ఆతిథ్యమిచ్చారు..



భవానీ భక్త బృందానికి స్వాగతం పలికిన సర్పంచ్ కొట్టి రాము, స్థానిక భవాని భక్తులు

మహిళా రైతు ఉత్పత్తిదారులకు శిక్షణ

కశింకోట: మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి కృషి చేయాలని రైతు ఉత్పత్తిదారుల సంస్థ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కె.జగన్నాథం కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం రెండో బ్యాచ్ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడి దళారుల బెడద లేకుండా తక్కువ ధరకు ఎక్కడ లభిస్తే అక్కడ ఎరువులు కొనుగోలు చేసుకోవాలన్నారు. గిట్టుబాటు అయ్యేలా పంటల అమ్మకాలు చేసుకోవాని సూచించారు. సంఘాల్లో సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు, రాయితీలు అందిస్తారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు, అక్కడి సిబ్బంది ద్వారా లభించే సేవల్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. సంఘ పుస్తకాలను నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా లీడర్ల బాధ్యతలను వివరించారు. ఎంపీఎం ఎస్.శ్రీనివాసరావు, మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షురాలు ఆడారి పరమేశ్వరి, కార్యదర్శి ముత్తా లక్ష్మి, సీసీలు సత్యనారాయణ, రామకృష్ణ, అనూరాధ పాల్గొన్నారు.

సెలవుల్లో స్కూళ్లు తెరిస్తే చర్యలు తీసుకోండి

అనకాపల్లిటౌన్: సెలవు దినాల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మామిడి రమణ కోరారు. ఈ మేరకు మండలంలోని కేఎస్ఆర్ కొత్తూరు డీఈవో కార్యాలయంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ పనిదినాల్లో కాలపరిమితిని పెంచి, తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.గీతాకృష్ణ, కోశాధికారి గొర్ల తరుణ్ పాల్గొన్నారు.



డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ రమణ